శతాబ్ది ఉత్సవాలకు వేళాయె



ఉత్సవాలకు సిద్ధమైన ప్రభుత్వ ఉన్నత పాఠశాల

- ముస్తాబైన భీమిలిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల
- నేడు, రేపు వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు
- భారీగా తరలిరానున్న పూర్వ విద్యార్థులు

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలకు ముస్తాబైంది. శనివారం అట్టహాసంగా ఈ వేడుకలు ప్రారంభం కానున్నాయి. రెండు రోజులపాటు జరిగే ఉత్సవాలకు ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 1924లో బ్రిటిష్ కాలంలో ఏర్పాటైన ఈ పాఠశాల 2024లో వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంది. దీంతో పూర్వ విద్యార్థులు ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. తొలుత ఈ ఉత్సవాల్లో ప్రభుత్వం కూడా భాగస్వామ్యం కావాలని భావించడంతో ఎమ్మెల్యే గంటా, జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు వచ్చి పరిశీలించడంతో పాటు, సమావేశాన్ని కూడా నిర్వహించి సహకరిస్తామని వెల్లడించారు. కానీ ఎన్నికల కోడ్ రావడంతో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలోనే ఈ వేడుకలు జరుగనున్నాయి.



తుదిమెరుగులు దిద్దుకుంటున్న పైలాన్

పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసుకున్న వాట్సప్ గ్రూప్

కలిసొచ్చిన వాట్సప్ గ్రూపులు

గతంలో ఇటువంటి వేడుకలు నిర్వహించాలంటే పూర్వ విద్యార్థులను గుర్తించి పిలవడం చాలా కష్టంగా ఉండేది. కానీ ఇప్పుడు వాట్సప్ గ్రూపులు ఎంతో సదుపాయంగా మారాయి. ఆరు నెలల క్రితం భీమిలిలోని పూర్వ విద్యార్థులు ఈ ఉత్సవాలను నిర్వహించాలని నిర్ణయించారు. వెంటనే వారు ఉత్సవ నిర్వహణ కమిటీని నియమించుకుని, గవర్నమెంట్ హైస్కూల్ భీమునిపట్నం సెంటినరీ సెలబ్రేషన్స్ 1924–2024 పేరుతో వాట్సప్ గ్రూప్‌ను క్రియేట్ చేసి, ఏర్పాట్లు మొదలు పెట్టారు. ఇందుకు అనూహ్యమైన స్పందన వచ్చింది. దేశ, విదేశాల్లో ఎక్కడెక్కడో ఉన్న పూర్వ విద్యార్థులు స్పందించి ఉత్సవాల నిర్వహణకు తమ పూర్తి మద్దతు, సహకారాన్ని అందిస్తామని వెల్లడించారు. ఆ మేరకు అందరూ విరాళాలు కూడా పంపారు. దీంతో ఉత్సాహంగా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఖర్చుల వివరాలు ఎప్పటికప్పుడు గ్రూప్‌లో పెడుతున్నారు. ఉత్సవ తేదీలను కూడా ఖరారు చేసి ఆ మేరకు అందరికీ సమాచారాన్ని అందించారు. పాఠశాల భవనాలకు మరమ్మతులు, పెయింటింగ్ వేశారు. ఉత్సవాలకు గుర్తుగా ఇక్కడ ఒక పైలాన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇదే ప్రాంగణంలో వేదికను ఏర్పాటు చేసి కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

అందరి సహకారంతో ముందుకు..

శనివారం నుంచి జరిగే రెండు రోజుల ఉత్సవాలను అందరి సహకారంతో ఎంతో ఘనంగా నిర్వహించనున్నామని ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గాడు అప్పలనాయుడు, మైలిపల్లి లక్ష్మణరావు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు ఉత్సవాలను ప్రారంభించనున్నామని తెలిపారు. ముందుగా పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయుల సమక్షంతో పైలాన్ ఆవిష్కరణ జరుగుతుందన్నారు. అనంతరం చిన్నబజారు నుంచి మెయిన్ రోడ్డు మీదుగా పెద్దబజారు వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అక్కడ నుంచి బీచ్ వద్ద ఏర్పాటు చేసిన రతన్ టాటా విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటామని, దీంతో ఆ రోజు కార్యక్రమాలు ముగుస్తాయని చెప్పారు. రెండో రోజు ఆదివారం ఉదయం పూర్వ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహిస్తామన్నారు. **పూర్వ విద్యార్థులు**, ప్రస్తుతం **పాఠశాలలో** చదువుతున్న **విద్యార్థులు** కలిసి భోజనం చేయడంతో **వేడుకలు** ముగుస్తాయన్నారు. ముఖ్య సభ్యులు మైలిపల్లి షణ్ముఖరావు, కాళ్ల సన్నీ, కె.ముత్యాలరావు, ఎం.వి.పార్వతీశం, టి.భీమారావు, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో ఉత్సవ కమిటీ సభ్యులు



వేడుకలకు సిద్ధమైన వేదిక ప్రాంగణం

ఎంతో ఉద్వేగంగా ఉంది..



ఈ ఉత్సవాలు జరుగుతున్నట్టు ప్రకటించినప్పటి నుంచి ఎంతో ఉద్వేగంగా ఉంది. ఎప్పుడో చిన్నప్పుడు చదువుకున్న పాఠశాలలో జరుగుతున్న శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొనేందుకు వస్తుండడం ఆనందంగా ఉంది.

– **దేవులపల్లి శివకుమార్**, ఒరాకిల్ సీఈవో, హైదరాబాద్

అందరికీ అపూర్వ అవకాశం



ఉత్సవాల సందర్భంగా అప్పట్లో చదువుకున్న తోటి విద్యార్థులను కలుసుకునే అపూర్వ అవకాశం ఇక్కడికి వచ్చే అందరికీ కలగనుంది. ఇప్పుడు ఎవరు ఎక్కడ ఉంటున్నారు? ఎలా ఉన్నారు? అనే విషయాలు తెలుసుకోవచ్చు. చాలా ఏళ్ల తరువాత వారితో సంతోషంగా గడపవచ్చు.

– **బోర అప్పలరెడ్డి**, విశ్రాంత జీఎం, కోల్ ఇండియా లిమిటెడ్, నాగ్‌పూర్

ఉత్సవ కమిటీ కృషి ప్రశంసనీయం



ఈ ఉత్సవాల నిర్వహణకు ఆరు నెలల నుంచి ఎంతో శ్రద్ధ, శ్రమ తీసుకుని అవసరమైన ప్రణాళికలు, ఏర్పాట్లు చేస్తున్న ఉత్సవ కమిటీ కృషి ఎంతో గొప్పది. వారు ఈ మేరకు బాధ్యతలు తీసుకోవడం వల్లే అందరూ రావడానికి అవకాశం కలిగింది.

– **దూర్వాసుల భగవాన్లు**, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, న్యూజెర్సీ, అమెరికా

క్లుప్తంగా

పాలిథిన్ కవర్ల స్వాధీనం



పాలిథిన్ కవర్లు స్వాధీనం చేసుకుంటున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహాలక్ష్మినాయుడు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ, కె.నగరపాలెం సచివాలయాల పరిధిలోని దుకాణాల్లో వినియోగిస్తున్న పాలిథిన్ కవర్లను శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహాలక్ష్మినాయుడు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ఆయన తన సిబ్బందితో కలసి పలు దుకాణాల్లో తనిఖీలు చేశారు. ఈ క్రమంలో పట్టుబడిన కవర్లను స్వాధీనం చేసుకున్నారు. ఎన్నిసార్లు అవగాహన కల్పిస్తున్నా వ్యాపారుల్లో మార్పు రావడం లేదని, ఇక నుంచి కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన



నాట్య ప్రదర్శనలో విద్యార్థినులు

కొమ్మాది: గీతం ఎక్సెలెన్స్ మీట్–25(జెమ్)లో భాగంగా శుక్రవారం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సంగీతం, నృత్యం, తదితర సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు.

ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నివారణ సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ సత్య

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం నగరానికి చెందిన నివారణ సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ సత్య ఆధ్వర్యంలో ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గుండెపోటు లక్షణాలు, సీపీఆర్ చేసే విధానం, క్యాన్సర్ కారకాలు, క్యాన్సర్ ఏయే భాగాలకు సోకుతుంది, నివారణ చర్యలను ఆమె వివరించారు. త్వరలో వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జైభీమ్ కన్వీనర్ కోన ప్రకాష్, ప్రధానోపాధ్యాయురాలు ఎంవీటీ రత్నం, ఉపాధ్యాయులు రేఖ అప్పారావు, ఎస్.ఎస్.విజయకుమార్, కీర్తి అనూరాధ, 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు.

శిథిలమైన క్వార్టర్ల కూల్చివేత



శిథిలమైన క్వార్టర్లను పొక్లెయిన్‌తో తొలగిస్తున్న దృశ్యం


భీమునిపట్నం: భీమిలి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శిథిలమైన క్వార్టర్లను శుక్రవారం కూల్చివేశారు. గతంలో ఇక్కడ సిబ్బంది నివాసం కోసం క్వార్టర్లు ఉండేవి. అవి శిథిలావస్థకు చేరడంతో పది సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉన్నాయి. అధికారుల ఆదేశాల మేరకు వాటిని పూర్తిగా తొలగించారు. తదుపరి ఇక్కడ ఎటువంటి నిర్మాణాలు చేపడతారో వేచి చూడవలసి ఉంది.

15 గ్రాముల బంగారు ఆభరణాల చోరీ

పీఎం పాలెం: చోరీ ఘటనపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. స్థానిక సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వుడా కాలనీ సైబర్ వల్లీ కాలనీ సీసీ పోలీస్ థియేటర్ వెనక నివసిస్తున్న నిరుజోగి ఎర్రమ్మ ఐటీ హౌస్ కీపింగ్ విభాగంలో సూపర్‌వైజర్‌గా పని చేస్తోంది. గతనెల 17న ఇంటికి తాళం వేసి తన తమ్ముడు గేదెల శంకరరావుతో సింగరాయపురంలోని తల్లి ఇంటికి వెళ్లింది. గత నెల 31వ తేదీ ఉదయం 9 గంటలకు తన ఇంటి తాళం పగులగొట్టి ఉందని సమీపంలో నివసిస్తున్న కీర్తన ఆమెకు తెలియజేసింది. ఇంటికి వచ్చి చూసుకోగా.. 15 గ్రాముల బరువు గల చెవి రింగులు, ముక్కు పుడక తదితర బంగారు ఆభరణాలు, 40 తులాల వెండి ఆభరణాలు చోరీ గుర్తించారు. వెంటనే పోలీసుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

సీతారాముల దాంపత్యం జగతికే ఆదర్శం

ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు



కొమ్మాది గాయత్రీ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవచిస్తున్న బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

పీఎం పాలెం: భారత వివాహ వ్యవస్థ మహోన్నతిని సీతారాముల కల్యాణ ఘట్టం జగతికి తెలియపరిచిందని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరారావు అన్నారు. శుక్రవారం సాయంత్రం కొమ్మాదిలోని గాయత్రి ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న సంపూర్ణ రామాయణ ప్రవచనంలో భాగంగా ఏడో రోజు బాలకాండలోని సీతారాములు కల్యాణ ఘట్టంను ఆయన ప్రవచించారు. పెద్దల అంగీకారంతోనే వివాహం చేసుకుంటానని రాముడు చెప్పిన తీరు నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. వధూవరుల బంధుత్వ ప్రాధాన్యతలను చక్కగా వివరించారు. సీతారాముల దాంపత్యం ఎప్పటికీ ఆదర్శప్రాయమన్నారు.

ఉద్యోగ విరమణ ఉపాధ్యాయులకు సన్మానం



కొత్త కొవ్వాడ పాఠశాలలో హెచ్‌ఎం రామారావు దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రఘు వర్మ

పద్మనాభం: మండలంలోని కొత్త కొవ్వాడ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేసి ఉద్యోగ విరమణ చేసిన సబ్బం రామారావు దంపతులను పాఠశాలలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. వారిని ఉపాధ్యాయఎమ్మెల్సీ పి.రఘువర్మ, ఉపాధ్యాయులు దుశ్శాలవాతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షుడు మొకర అప్పలనాయుడు, ఉపాధ్యాయ సంఘ నాయకులు రెడ్డిపల్లి జగదీష్‌బాబు, బోని సూర్యనారాయణ, కోల సన్యాసిరావు, పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చంద్రంపాలెంలో ఉపాధ్యాయుడు ప్రసాదరావు దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

మధురవాడ: చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విశేష సేవలు అందించి ఉద్యోగ విరమణ చేసిన బయాలజీ ఉపాధ్యాయుడు ఆకుల ప్రసాదరావు దంపతులను పాఠశాలలో శుక్రవారం సన్మానించారు. విద్యార్థులను తీర్చిదిద్దడంలో, పాఠశాల అభివృద్ధికి చేసిన కృషిని ప్రధానోపాధ్యాయుడు రవి, సీనియర్ ఉపాధ్యాయుడు సోమయాజులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉపాధ్యా సంఘాల నాయకులు ప్రకాష్ బాబు, శ్రీను, స్వామి, మహేష్, సునీత, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికను చెత్తతో నింపేశారు.!

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్‌లో క్లాప్ వాహనాల ద్వారా ఇంటింటా సేకరిస్తున్న చెత్తను దారి మళ్లించి అటు అధికారులు, ఇటు కూటమి నాయకులు సొమ్ము చేసుకుంటున్నారు. గోస్తని నది తీరంలో పల్లపు ప్రదేశంలో ఉన్న శ్మశానవాటికను గ్రావెల్‌తో కాకుండా వందలాది లోడుల చెత్తతో పూడ్చి పెడుతున్నారు. వాస్తవానికి జోన్‌లో సేకరించిన చెత్తను నమ్మివానిపేట డంపింగ్ యార్డుకు మళ్లించి అక్కడ నుంచి క్లోజ్డ్ కాంపాక్ట్ వాహనాల ద్వారా కాపులుప్పాడలోని జిందాల్ పవర్ ప్లాంట్‌కు తరలించవలసి ఉంటుంది. ఇటీవల నమ్మివానిపేట డంపింగ్ యార్డు నుంచి కూడా వందలాది క్వారీ లారీలను వినియోగించి చెత్త వ్యర్థాలను శ్మశానవాటికలకు తరలించిన సంగతి తెలిసిందే. దీనిపై కూటమి నాయకులలోనే బేధాభిప్రాయాలు తలెత్తాయి. చెత్త పేరుతో జరుగుతున్న అవినీతిని అరికట్టి హిందూ శ్మశానవాటిక నుంచి చెత్తను తరలించాలని జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.



తగరపువలస గోస్తని నది తీరంలో చెత్తతో నిండిపోయిన శ్మశానవాటిక

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పీఎం పాలెం: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మరణించాడు. ఇందుకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దిమిలి సూరిబాబు(43) కొమ్మాది వైఎస్సార్ కాలనీ ఎఫ్‌ఎఫ్–1 బ్లాకులో కుటుంబంతో నివసిస్తున్నాడు. కార్పెంటరీ పనులు చేసే ఈయన మద్యానికి బానిసయ్యాడు. గత నెల 28వ తేదీ సాయంత్రం 4 గంటలకు తన ఫ్లాట్ మెట్లు ఎక్కుతుండగా జారి పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గాయత్రీ ఆస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మరణించాడు. మృతుని కుమారుడు పరమేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ప్రైవేట్ బస్సులో గంజాయి తరలింపు

తగరపువలస: స్థానిక గోస్తనీ నది వంతెన వద్ద శుక్రవారం ఒడిశా నుంచి విశాఖ వైపు వస్తున్న ఓ ప్రైవేట్ బస్సును ఆపి భీమిలి పోలీసులు తనిఖీ చేయగా.. షయ్యద్ షకీర్ అనే వ్యక్తి నుంచి రెండు కిలోల గంజాయి లభించింది. తోటి ప్రయాణికులకు అనుమానం రావడంతో భీమిలి పోలీసులకు ఈ మేరకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు వంతెన వద్ద బస్సును ఆపి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహారాష్ట్రకు చెందిన నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

నేలబావిలో పడి వివాహిత మృతి

తగరపువలస: ఆనందపురం మండలం శిర్లపాలెంలో శుక్రవారం నేలబావిలో పడి కోరాడ సత్యవతి(46) అనే మహిళ మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సత్యవతి ఉదయం 9 గంటల సమయంలో కళ్లాలకు వెళ్లి పశువులకు నీరు పెట్టేందుకు బకెట్టుతో నేలబావిలో నీరు తీసే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు అందులో పడిపోయినట్టు భావిస్తున్నారు. ఉదయం కళ్లాలకు వెళ్లిన తల్లి సాయంత్రం వరకు రాకపోవడంతో కుమారుడు వెతికే ప్రయత్నంలో ఆమె మృతదేహం బావిలో తేలి కనిపించింది. స్థానికుల సాయంతో ఆమెను బయటకు తీసి ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతురాలికి భర్త పైడి సింహాచలంతో పాటు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుమారులిద్దరూ లారీ డ్రైవర్లుగా, భర్త క్లీనర్‌గా పనిచేస్తున్నారు.

నేడు సామాజిక పింఛన్ల పంపిణీ

తగరపువలస: ఆనందపురం మండలంలో 18 సచివాలయాల పరిధిలో శనివారం 8,632 మందికి రూ.3.66 కోట్లు సామాజిక పింఛన్ల పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీవో ఎస్.జానకి తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున పింఛన్ల పంపిణీలో కోడ్ ఉల్లంఘన జరగకుండా చూడాలని సిబ్బందికి సూచనలు జారీ చేసినట్టు పేర్కొన్నారు.

మధురవాడలో 125 రిజిస్ట్రేషన్లు



మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రిజిస్ట్రేషన్ల కోసం బారులు తీరిన కక్షిదారులు



భీమిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సందడి

మధురవాడ: రాష్ట్ర ప్రభుత్వం శనివారం నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలు విపరీతంగా పెంచిన కారణంగా గత రెండు రోజులుగా రిజిస్ట్రేషన్ల కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద కక్షిదారులు బారులు తీరుతున్నారు. ఎన్నడూ లేని విధంగా మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద గురువారం 90, శుక్రవారం 125 రిజిస్ట్రేషన్లు జరిగినట్టు సబ్ రిజిస్ట్రార్ చక్రపాణి తెలిపారు. ఇక్కడ ఈయనతో పాటు మరో సబ్ రిజిస్ట్రార్ రోహిత్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ రిజిస్ట్రేషన్లు రాత్రి 8.30 గంటల వరకు జరిగాయి.

ఆనందపురంలో ఐదు రెట్లు

ఆనందపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సాధారణ రోజుల్లో 6 నుంచి 10 వరకు రిజిస్ట్రేషన్లు అవుతుంటాయి. శనివారం నుంచి రిజిస్ట్రేషన్ల ధరలు అనూహ్యంగా పెరుగుతుండడంతో శుక్రవారం 50 నుంచి 60 మధ్యలో రిజిస్ట్రేషన్లు జరిగినట్టు సిబ్బంది తెలిపారు.

చురుగ్గా భూరిజిస్ట్రేషన్లు

భీమునిపట్నం: భీమిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద శుక్రవారం అనేక మంది భూ రిజిస్ట్రేషన్ల కోసం వచ్చారు. దీంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సందడిగా మారింది.

పశు వ్యాధులపై అప్రమత్తత అవసరం

పద్మనాభం: పశువులకు సోకే వ్యాధుల పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్య శాఖ జాయింట్ డైరెక్టర్ డి.రామకృష్ణారావు అన్నారు. మండలంలోని మద్ది, తునివలస గ్రామాల్లో శుక్రవారం ఆయన పశు వైద్య శిబిరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణారావు మాట్లాడుతూ పశువులకు వ్యాధులు సోకితే తక్షణమే దగ్గరలో ఉన్న పశు వైద్య సిబ్బందికి చూపించి చికిత్స చేయించాలనారు. మద్దిలో 451, తునివలసలో 374 పశువులకు నట్టల వ్యాధి నివారణకు మందులు పట్టారు. ఈ కార్యక్రమాల్లో పశు వైద్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖరరావు, పద్మనాభం పశు వైద్యాధికారి మహేష్ కుమార్, రెడ్డిపల్లి పశు వైద్యాధికారి లక్ష్మణరావు పాల్గొన్నారు.




తునివలసలో పశువులకు నట్టల వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్న పశు వైద్య శాఖ జాయింట్ డైరెక్టర్ రామకృష్ణారావు

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

తగరపువలస: ఆనందపురం మండలం లొడగలవానిపాలెంలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను శుక్రవారం ఆనందపురం ఎస్ఐ శివ అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.23,400 స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై 91 క్లాజ్ గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శివ తెలిపారు.

పశువుల సంచారంతో బెంబేలు



పీఎం పాలెం రోడ్డులో వాహనాలకు అడ్డంగా ఉన్న పశువులు

పీఎం పాలెం: పశువులు యథేచ్ఛగా రోడ్లపై సంచరించడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. సుమారు 2 కిలోమీటర్ల దూరం ఉన్న కారుషెడ్ కూడలి నుంచి పీఎం పాలెం ఆఖరు బస్టాపు వరకూ వెళ్లే 80 అడుగుల రోడ్డులో పశువులు సంచారం ఎక్కువైంది. వాటిపై నియంత్రణ లేకపోవడంతో రోడ్లపై పశువుల సంచారం అధికంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా ఆత్మార్పణ దినోత్సవం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

భీమునిపట్నం: భీమిలిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మ వారి మూల విరాట్‌కు అర్చకుడు వెలవలపల్లి సత్యసాయి శంకర్ ప్రత్యేక పూజలు, పంచామృత, నారికేళ, ఫలరసాలతో అభిషేకాలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పూసర్ల శ్రీనివాసరావు, కార్యదర్శి బొండ బాలాజీ, కోశాధికారి మాదా వెంకట జగన్నాథ గుప్తా, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు ముమ్మిడిశెట్టి సునీల్, కార్యదర్శి ఉశిరికల విశ్వేశ్వరరావు, కోశాధికారి వెంకటేష్, వాసవీ ప్రార్థన మందిర సంఘం అధ్యక్షుడు కట్టమూరి రమణరావు, కార్యదర్శి కంచర్ల కామేష్, కోశాధికారి బొండా కిరణ్ పాల్గొన్నారు.

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ



శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలను తీసుకుని వస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా జరిగాయి. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేష వస్త్రం, అభిషేక సామగ్రిని ప్రదక్షిణగా మంగళ వాయిద్యాల నడుమ తీసుకెళ్లారు. అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

విద్యార్థులకు మానసిక వికాసంపై పరీక్షలు

పద్మనాభం: మండలంలోని ఆర్‌వీ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులకు శుక్రవారం మానసిక వికాసంపై పరీక్షలు నిర్వహించారు. భీమునిపట్నం డైట్ లెక్చరర్ త్రినాథరావు చాత్రో ఉపాధ్యాయులు మోహన్, అప్పారావు సహాయంతో ఈ పరీక్ష జరిపారు. విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తగ్గించడానికి ఎటువంటి పద్ధతులు అవలంబిస్తున్నారో తెలుసుకోవడానికి 33 ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. హెచ్‌ఎం విజినిగి శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.